# శ్రీవేణుగోపాల స్వామి ఓరియంటల్ హైస్కూల్ వజ్రోత్సవము
## (60 సంవత్సరములు)

హైస్కూల్ స్థాపన : 1962వ సంవత్సరం గ్రామం: చేకూరపాడు

పాఠశాల స్థాపనకు కృషి సల్పిన చిరస్మరణీయులు శ్రీ శ్రీ శ్రీ శిరిగిరి పేరయ్య గారు జీవిత విశేషములు క్లుప్తంగా



శ్రీ శిరిగిరి పేరయ్య గారు

**భారత స్వాతంత్ర్యానికి పూర్వం :**

అది 20వ శతాబ్ద కాలం ప్రధమార్ధం. భారతదేశం ఆంగ్లేయుల పాలనలో ఉంది. ఆంగ్లేయుల పరిపాలనా కాలంలో భారతదేశం 565 రాజరికపు రాజ్యాలుగా ఉండేది. అందులో కాశ్మీర్, హైదరాబాద్, మైసూర్ మాత్రమే పెద్ద రాజ్యాలు, మద్రాసు మైసూర్ రాజ్యంలోనిది. మైసూరు రాజ్యంలోని చిన్న గ్రామం చేకూరపాడు. గ్రామంలో మట్టి గోడలతో కట్టిన పూరిళ్ళు, పెంకుటిళ్ళు దర్శనమిచ్చేవి. బజార్లు ఇరుకుగొందులుగా ఉండేవి. గ్రామంలోని పిల్లలకు చదువు నేర్పుటకు పాఠశాల లేదు. ఊరి మధ్యలో శ్రీకృష్ణ దేవరాయలు కాలం నాటి రాతి కట్టడంతో నిర్మించిన శ్రీ వేణుగోపాల స్వామివారి పురాతన దేవాలయం ఉండేది.

గ్రామంలో అన్ని రకాల కుల వృత్తుల వారు ఉన్నారు. ఎవరి కుల వృత్తులు వారు కలిసి మెలసి జీవనం సాగించేవారు. కొద్దిమంది బ్రాహ్మణులు, ముస్లిమ్స్ వ్యవసాయ భూములు కలిగి ఉండి, వ్యవసాయం చేసేవారు. గ్రామంలో స్థితిగల రైతు కుటుంబాలు కొద్దిమంది మాత్రమే, మిగిలిన రైతు కుటుంబాలన్నీ సామాన్య, మధ్య తరగతి రైతు కుటుంబాలే.

గ్రామంలో మధ్యతరగతి రైతు కుటుంబీకుడైన శ్రీశ్రీశ్రీ శిరిగిరి పెద వెంకయ్య, వెంకట లక్ష్మమ్మ దంపతులకు రాఘవులు, సుబ్బయ్య అనబడు ఇద్దరు మగ సంతానం ఉన్నారు. 1905 సం. ఆగష్టు 10వ తేదిన ఈ దంపతులకు 3వ సంతానంగా మగ బిడ్డ జన్మించారు. ఆ బిడ్డకు పేరయ్యగా నామకరణ చేయించారు. పేరయ్య గారు చిన్నతనంలో ముద్దుగా బొద్దుగా ఉండి, అల్లారు ముద్దుగా పెరిగారు.

ఆ రోజుల్లో గ్రామంలో పిల్లల చదువులకు స్కూల్ లేనందువలన గ్రామంలో స్థిర నివాసిగా ఉన్న రామ్మూర్తి పంతులుగారు తన సొంత ఇంటి వద్దనే ఓనమాలు దిద్దించేవారు. 5సం.లు పైబడిన ప్రాయంగల ముగ్గురు అన్నదమ్ములు రామ్మూర్తి పంతులు గారి వద్దే ఓనమాలు దిద్దుకొని, చదవటం, రాయటం నేర్చుకున్నారు. కాల చక్రం తిరిగినది. ముగ్గురు అన్నదమ్ములు యుక్త వయస్కులైనారు. పెద్ద వారిద్దరికీ వివాహం జరిగి ఒక ఇంటివారైనారు. రైతులకు గల భూములన్నింటిలోనూ వర్షాధార పంటలైన జొన్న, ఒరిగలు, రాగులు, కొర్రలు మున్నగు పంటలు పండేవి. నాటు పొగాకు వేసేవారు. రైతులంతా పగలు పొలం పనులలో నిమిగ్నమై ఉండేవారు. అందువలన రామ్మూర్తి పంతులు గారు రాత్రివేళ్ళలో పెద్దలకు విద్యాబుద్ధులు నేర్పించేవారు. చిన్నవాడైన పేరయ్య గారికి 1930 సం.లో సమీప గ్రామమైన గుడిమెళ్ళపాడు గ్రామ కాపురస్తుడు పొడపాటి లక్ష్మయ్య గారి కుమార్తె నారాయణమ్మతో వివాహం జరిపించారు. ముగ్గురు అన్నదమ్ములు తండ్రి గారైన పెద వెంకయ్య గారికి వ్యవసాయ పనులలో సహకారం అందించేవారు.

ఇదిలా ఉండగా దేశంలో స్వాతంత్య ఉద్యమాలు ప్రారంభమైనవి. గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా ఉద్యమంలో విరివిగా పాల్గొనేవారు. పేరయ్య గారు కూడా తన స్నేహితులతో కలసి ఉద్యమాలలో పాల్గొనేవారు. ఎట్టకేలకు అనేక ఉద్యమాల ఫలితంగా ఆంగ్లేయులు 562 రాచరిక రాజ్యాలను భారత్లో విలీనం చేసి భారతదేశానికి స్వాతంత్యాన్ని ప్రకటించారు. తదుపరి భారత దేశం స్వపరిపాలనకు అనువుగా రాజ్యాంగం రచించబడి 1950సం. జనవరి 26న అమలుకు వచ్చినది. అదే ఇండిపెండెన్స్ డే గా ప్రకటించబడి. పూర్తి స్వాతంత్య భారత దేశం అయినది.

**భారత దేశం స్వాతంత్య అనంతరం :**

కాలగమనంలో జనాభా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడ్డవి. భాష ప్రాతి పదికన రాష్ట్రాలు విడగొట్ట బడ్డాయి, ఆ సమయంలో పొట్టి శ్రీరాములు గారి ఆత్మార్పణంతో మద్రాసు రాష్ట్రము నుండి విడగొట్టబడి ఆంధ్రప్రదేశ్ కర్నూల్ రాజధానిగా అవతరించింది. హైదరాబాదు సంస్థానం భారత్ లో విలీనం కాబడిన తదుపరి హైదరాబాదు రాజధానిగా ప్రకటించబడి తెలంగాణాతో కలిసిన పూర్తి ఆంధ్రప్రదేశ్ గా

ఏర్పడినది. అప్పుడు రాజధాని కర్నూల్ నుండి హైదరాబాదుకు తరలించబడినది. పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రంలో జిల్లాలు, సమితులు, పంచాయితీలు ఏర్పాటు చేయబడ్డాయి. అనంతర కాలంలో తండ్రి పెద్ద వెంకయ్య గారు తనువు చాలించారు. కుటుంబ భారం అంతా పెద్ద కుమారుడు అయిన రాఘవులు గారిపై పడింది. తరువాత కాలంలో మూడు సార్లు పంచాయితీ ప్రెసిడెంట్ గా ఎన్నిక కాబడి గ్రామ పరిపాలకుడుగా సేవలందించి, మంచి పేరు సంపాదించారు. వ్యవసాయ భారమంతా రెండవ కుమారుడైన సుబ్బయ్య గారి భుజ స్కందాలపై పడింది. పేరయ్య గారు అన్నయ్యకు వ్యవసాయంలో చేదోడు వాదోడుగా ఉండేవారు.

దక్షిణాంధ్రలో వర్షాభావం వలన కరువు సంభవించి, వ్యవసాయ పనులకు అంతరాయం కలిగినది. అదే సమయంలో ఉత్తరాంధ్రలో బ్యారన్ (దొర) పొగాకు పంట సాగుబడి విస్తరించింది. చిన్నవాడైన పేరయ్య గారి ఆలోచనలో పడ్డాడు. కొంతమంది గ్రామ మిత్రులతో సంప్రదించిన పిదప బాపట్ల ప్రాంతంలో పోగానారు దొడ్లు పెట్టి పోగానారు వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. రైతులకు నాణ్యమైనపోగానారు అందించి రైతులతో సక్యతగా మెలిగి వారి ఆదరాభిమానాలను చొరగోన్నారు. రైతులకు పేరయ్య చౌదరిగారి మీద నమ్మకం ఏర్పడి ఆయన మీద గౌరవ భావం ఇనుమడించినది. కొంత కాలం వ్యాపారం అలా సాగి మంచి లాభాలను ఆర్జించారు. తదనంతరం నాగార్జున సాగర్ డ్యాం పూర్తయి బాపట్ల వరి పండే భూములుగా పరివర్తనం చెందినవి. పోగనారు వ్యాపారానికి గిరాకి తగ్గింది.  కొద్దిమంది మిత్రులు ఆ ప్రాంతంలో కొద్దిగా పొలాలు కొని మాగాణి వ్యవసాయానికి నాంది పలికారు.

పేరయ్య గారు తమ గ్రామ మిత్రుడు పోకూరి శేషయ్య గారితో ఆలోచన చేసి, రైతులతో తమకున్న అనుబంధాన్ని గుర్తు తెచ్చుకొని చిన్నగా పొగాకు వ్యాపారం చేయాలని నిశ్చయించుకొన్నారు. ఆ వ్యాపారంలో వ్యాపార స్థోమతను బట్టి డబ్బు బాగానే సంపాదించగలిగారు. వ్యాపార సంపాదనకు మూలం పేరయ్య గారి ఆలోచనలే. తదుపరి త్రోవగుంట గ్రామం నుండి మరొక మిత్రుడు మండువ చిన శేషయ్యను భాగస్వామిగా చేసుకొని త్రోవగుంట వద్ద నవభారత్ టొబాకో కంపెనీ అనే పేరుతొ కంపెనీని రిజిస్టర్ చేయించి పొగాకు వ్యాపారం ప్రారంభించారు. కాలక్రమంలో పొగాకు వ్యాపారం దినదిన ప్రవర్ధమానమై పొగాకు ఎగుమతి చేయు స్థాయికి ఎదిగారు. పేరయ్య గారికి పెద్దగా చదువు

లేనందున రైతులతో ఎక్కువ సంబంధాలు ఉన్నందు వలన, పొగాకు కొనుగోలు పేరయ్య గారి ద్వారానే జరిగేవి. ఎగుమతి లావాదేవీలు కంపెనీ వ్యవహారాలు మండువ శేషయ్య, పోకూరి శేషయ్య గారు నిర్వహించేవారు. పేరయ్య చౌదరి గారు రైతుల వ్యవసాయ ఖర్చులకు గాను, అవసరయ్యే ఖర్చులను తన చేతుల మీదుగా అందించే వారు. నిరుపేద కుటుంబాల పిల్లల చదువులకు తన వాటాగా కంపెనీని నుండి వచ్చిన డబ్బులో కొంత భాగం సహాయం చేసేవారు. కానీ, తన మనసుకు తృప్తి కలుగలేదు. తను పుట్టిన పురిటి గడ్డకు గ్రామస్తులందరికి సంతృప్తినిచ్చే కార్యక్రమం చేయాలని ఆలోచించారు. తన ఆలోచనలో తనకు పై చదువు లేనందువలన తన పొగాకు వ్యాపారంలో తను అనుభవించిన అసౌకర్యాలను, పై చదువులకు గ్రామంలో ఉన్న నిరుపేద పిల్లలు  దూర ప్రాంతాలకు వెళ్ళి చదువుకోలేపోతున్న ఇబ్బందులు స్మరణకు వచ్చేవి, ఆ స్మరణయే స్వగ్రామంలో పిల్లల పై చదువులకు పాఠశాల స్థాపనకు నాంది.

ఆ రోజులలో పేరయ్య గారు పొగాకు వ్యాపార మిత్రుడు దారా గోపాల శాస్త్రి గారు ఒంగోలు సి.యస్.ఆర్. శర్మ కాలేజి అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. పేరయ్య గారు ఆయనను కలసి పాఠశాల  స్థాపన విషయమై సహాయ సలహాలను అడిగారు. దారా గోపాల శాస్త్రి గారి సలహాలననుసరించి ఇద్దరు కలసి ఆనాటి కందుకూరు MLA నలమోతు చెంచు రామ నాయుడుతో హైస్కూల్ స్థాపన విషయమై సంప్రదింపులు జరిపారు. చెంచు రామ నాయుడు గారు “ఇంత చిన్న గ్రామానికి హైస్కూల్  పర్మిషన్ రావటం కష్టం ఎదో ఒక ప్రత్యేకత ఉండాలి” కాబట్టి “ఓరియంటల్ హైస్కూల్” గా ప్రయత్నం చేద్దామని చెప్పారు. హైస్కూల్ రిజిస్టర్ చేయాలంటే నామకరణం చేయాలి ఆ పరిస్థితులలో గ్రామ ప్రజలందరిని సంప్రదించి గ్రామస్తుల సలహా మేరకు గ్రామం మధ్యలో గల శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవాలయం పేరుతో “శ్రీ వేణుగోపాల స్వామి ఓరియంటల్ హైస్కూల్” పేరుతొ రిజిస్టర్ చేయించి. ఆనాటి సమాచార బ్రాడ్కాస్టింగ్ మినిస్టర్ శ్రీ బెజవాడ గోపాల్ రెడ్డి గారి ద్వారా ప్రయత్నాలు కొనసాగించారు.

ఎట్టకేలకు వారి ప్రయత్నాలు ఫలించి 1962వ సం.లో హైస్కూల్ స్థాపనకు పర్మిషన్ వచ్చింది. హైస్కూల్ స్థాపన పర్మిషన్ కు అంతా తానై కర్త, కర్మ, క్రియగా పని చేసిన పేరయ్య గారు ధన్యజీవి. హైస్కూల్ భవనం లేనందువలన గ్రామ సర్పంచ్ శిరిగిరి రాఘవులు  (తన పెద్దన్నయ్య)  గారిని సంప్రదించి  శ్రీశ్రీ శిరిగిరి పెద్ద వెంకయ్య (తన

నాన్న గారు) గారి గోడ్ల చావడిలో 6వ తరగతి క్లాసుల ప్రారంభానికి ఏర్పాటు చేసినారు. ఉపాధ్యాయ నియామకాలు జరగని కారణంగా మొదట్లో శ్రీ శిరిగిరి సుబ్బారావు గారు, శిరిగిరి వెంకటేశ్వర్లు గారు, శ్రీ వడ్డేళ్ళ వీరయ్య గారు (తండ్రి సూరయ్య) వడ్డేళ్ళ వీరయ్య చౌదరి గారు (తండ్రి సుబ్బయ్య) 6వ తరగతి పాఠాలు బోదించేవారు. తదుపరి మొదట ఉపాధ్యాయులు శ్రీ వెల్ది వెంకటేశ్వర్లు గారి నియామకం జరిగి ఏకోపాధ్యాయునిగా పాఠాలు బోదించేవాడు. హై స్కూల్ భవన నిర్మాణం జరపవలసి ఉన్నది. హై స్కూల్ భవన నిర్మాణముకు ఊర చెరువు పక్కన గల చెరువు మాన్యం ఖాళీ ప్రదేశమును అనువుగా భావించి గ్రామ పెద్దలను సంప్రదించి, చెరువు మాన్యం స్థలానికి పర్మిషన్ తీసుకొని బిల్డింగ్ పనులు ప్రారంభించారు. బిల్డింగ్ నిర్మాణ పనుల చేయించుటకు పర్యవేక్షకునిగా పని చేసి బిల్డింగ్ త్వరిత గతి నిర్మాణము పూర్తి చేయించిన శ్రీ వడ్డేళ్ళ వీరయ్య చౌదరి గారు అభినందనీయుడు. 1962 సెప్టెంబర్ 27వ తేదిన ఆనాటి సమాచార బ్రాడ్కాస్టింగ్ కేబినేట్ మినిస్టర్ గా ఉన్న శ్రీ బెజవాడ గోపాల రెడ్డి గారిచే భవన ప్రారంభోత్సవం వైభవోపేతంగా జరిగినది.

హైస్కూల్ ప్రధానోపాధ్యాయునిగా ఒంగోలు మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయునిగా ఉద్యోగ విరమణ చేసిన కీ.శే.మట్టా రామయ్య గారు నియమించ బడినారు. ఆయన ఇంగ్లీష్ పాఠాలు చెప్పేవారు. శ్రీ కండూరి వెంకటరమణా చార్యులు (కొత్తపట్నం) సంస్కృత ఉపాధ్యాయునిగా నియమించబడినారు. శ్రీ వీరబ్రహ్మం (ఇనమన మేళ్లూరు) డ్రిల్ టీచర్ గా నియమించబడినారు. తరువాత కాలంలో మట్టా రామయ్య గారు వయసు రీత్యా రిటైర్ అయినారు. అప్పుడు డి.ఈ.ఓ. గారు సుబ్రహ్మణ్యం పిల్లే గారిని ప్రధానోపాధ్యాయు నిగా నియమితులైనారు. తరువాత వయసు రీత్యా రిటైర్ అయినారు. శ్రీ గడ్డిపాటి సుబ్బారావు గారు హిందీ పండిట్ గా, శ్రీ బాచిన నరసింహరావు గారు సెకండ్ గ్రేడ్ టీచర్ గా, ముప్పరాజు సుబ్బారావుగారు (డ్రిల్ మాస్టర్) పూర్తిస్థాయి ఉపాధ్యాయులుగా , శ్రీ రుక్మాంగద గారు సంస్కృత పండిట్ గా, కృష్ణ ప్రసాద్ గారు సంస్కృత పండిట్, మునిరత్నం నాయుడు గారు గ్రేడ్ -II సంస్కృత పండిట్, సారంగపాణి గారు తెలుగు పండిట్ గా నియమించటం జరిగినది. శ్రీ తన్నీరు గురవయ్య గారిని ప్రధానోపాధ్యాయునిగా నియమించడం జరిగినది. శ్రీమతి సూర్య కుమారి మేడం గారు బి.ఈ.డి. టీచర్ గా నియమించడం జరిగినది. ఇంకా చాలామంది ఉపాధ్యాయులుగా నియమించబడి, చేకురపాడు గ్రామ విద్యార్థులకేకాక, చుట్టూ పక్క గ్రామాల విద్యార్థుల

భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారు. స్కూల్ క్లార్క్, లైబ్రేరియన్ గా వద్దినేని వెంకట శేషయ్య గారు నియమించబడినారు. షేక్ బుడే సాహెబ్ స్కూల్ వాచ్ మెన్ గా, షేక్ చందాబి స్వీపర్ గా నియమించబడినారు.

ఈ విధంగా శ్రీ పేరయ్య గారు అనేక మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసి విద్యాదాతగా వెలుగొందినాడు.

స్వగ్రామంలో ఎలిమెంటరీ స్కూల్ అద్దె ఇంట్లో కొనసాగటం గమనించి హైస్కూల్ ఎదురుగా ఉన్న పొలంలో 75సెంట్ల భూమి కొనుగోలు చేసి సగ భాగంలో స్కూల్ నిర్మాణాలు, నిర్మింపజేశారు. మిగిలిన సగభాగం హైస్కూల్ ఆట స్థలంగా వినియోగించుటకు అవకాశం కల్పించినారు.

చేకూరపాడు గ్రామంలో తపాలా శాఖ లేదు. రెండు మూడు రోజులకు ఒకసారి తపాలా వచ్చేది, హై స్కూల్ లావాదేవిలు జరుపుటకు హై స్కూల్ యాజమాన్యం అనేక ఇబ్బందులకు గరయ్యేది. ఈ ఇబ్బందులు గమనించిన పేరయ్య గారు తపాలా కార్యాలయం వారితో సంప్రదింపులు జరిపి గ్రామానికి తపాలా శాఖను తెచ్చుట లో ప్రముఖ పాత్ర పోషించినారు.

స్వగ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం శిధిలావస్థకు చేరుకోవటం గమనించి తాను చైర్మన్ గా ఉండి, గ్రామస్తులందరిని సమావేశ పరచి గ్రామస్తులందరి సహకారాన్ని స్వీకరించి ఆలయ పునరుద్ధరణకు ప్రారంభ పనులకు శ్రీకారం చుట్టారు. అంతేకాక 1972సం.లో తిమ్మసముద్రం నివాసులైన వెల్ది వెంకటేశ్వర్లు మంగమ్మ గార్లతో సంప్రదించి ఒంగోలులో వి.వి. & యం. ఎయిడెడ్ కళాశాల స్థాపనకు పముఖ పాత్ర వహించారు. ఆ కళాశాలకు ఉపాధ్యక్షునిగా కొనసాగుతూ కళాశాల భవన నిర్మాణానికి సహకరించి అనేక మందికి ఉద్యోగ అవకాశాలను కల్పించాడు.

పేరయ్య గారు ఎన్ని దాన ధర్మాలు చేసినా, స్వగ్రామానికి ఎన్ని సేవలందించినా తనకు సంతానం కలగ నందున వారసత్వం లేమి తన మనసునకు బాధించింది. ఆ సమయంలో తన పెద్దన్నయ్య రాఘవులు గారి మూడవ కుమారుడు ఆయన వెంకట రావు వరఫ్ పెద వెంకయ్య గారిని దత్తత తీసుకొని గుడిమెళ్ళపాడు నివాసి తన సొంత బావమరిది పొడపాటి శేషయ్య గారి కుమార్తె అంజమ్మతో వివాహం జరిపించి తన మనసును తృప్తి పరుచుకున్నాడు. తదనంతరం తేది. 18.09.1988 సం.లో అనారోగ్య కారణాలతో పరమపదించారు. ఆయన మరణించినా గ్రామానికి ఆయన చేసిన సేవలు గ్రామస్తుల మనసులో చిరస్థాయిగా నిలిచి ఉన్నాయి.

సూచన: కీ.శే. పేరయ్య గారి మరణాంతరం ఆయన దత్తు కుమారుడు శిరిగిరి వెంకటరావు వరఫ్ పెద వెంకయ్య గారు హైస్కూల్ పాలక వర్గంలో మెంబర్ గా కొనసాగుతున్నాడు.

హైస్కూల్ మొదటి కరస్పాండెంట్ గా కీ.శే. ఉప్పలపాటి సత్యనారాయణ గారు విధులు నిర్వహించారు (కొన్ని నెలలు మాత్రమే), కాలక్రమంలో కీ.శే. వడ్డేళ్ళ వీరయ్య చౌదరి (తండ్రి సుబ్బయ్య) కీ.శే. శిరిగిరి చిన్న బైరాగి చౌదరి, కీ.శే. శిరిగిరి పెద్ద బైరాగి చౌదరి చివరగా కీ.శే. శిరిగిరి వెంకటేశ్వర్లు గారు హైస్కూల్ కరస్పాండెంట్ గా కొనసాగి సేవలందించారు. తదుపరి ప్రస్తుత కరస్పాండెంట్ కీ.శే. శిరిగిరి వెంకటేశ్వర్లు గారు చనిపోయి నందున పేరయ్య చౌదరి గారు కుమారుడు వెంకట రావు ఉరఫ్ పెద వెంకయ్య హైస్కూల్ కరస్పాండెంట్ గా కొనసాగుతున్నారు. శ్రీ తుమ్మల వెంకయ్య గారి సహకారంతో హైస్కూల్ ఫెన్సింగ్ చేయబంది. ప్రస్తుత హైస్కూల్ కమిటీ అధ్యక్షులుగా వడ్డేళ్ళ బాస్కర్ (తండ్రి వెంకటేశ్వర్లు) గారు సేవలందిస్తున్నారు.

హైస్కూల్ వజ్రోత్సవ సందర్భంగా తేది.13.01.2024న హైస్కూల్ స్థాపనకు గుర్తుగా కీ.శే. శిరిగిరి పేరయ్య గారి విగ్రహాన్ని హై స్కూల్ ఆవరణలో ప్రతిష్టించటం ఎంతో ఆనందదాయకం....

**రచన, సహకారం...**
కొమ్మినేని సత్యనారాయణ
హై స్కూల్ పూర్వ విద్యార్థి
1967-68 SSLC, First Batch

ఇట్లు
శ్రీ పేరయ్య జీవిత విశేషాలు సమర్పకుడు
**శ్రీ శిరిగిరి వెంకట్రావు వరఫ్ పెద వెంకయ్య గారు**, ప్రస్తుత సెక్రటరీ & కరస్పాండెంట్